మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 30-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 331 Issue: 331

30 మే 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:42 తిథి చతుర్దశి ఉ. 11:59 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం విశాఖ మ. 1:14 వరకు తరువాత అనురాధ యోగం శివ తె. 5:17o వరకు కరణం వనిజ ఉ. 11:59 వరకు విష్టి రా. 1:06o వరకు వర్జ్యం సా. 5:49 నుండి రా. 7:36 వరకు దుర్ముహూర్తం ఉ. 7:28 నుండి ఉ. 8:20 వరకు రాహుకాలం ఉ. 8:59 నుండి ఉ. 10:36 వరకు యమగండం మ. 1:50 నుండి మ. 3:28 వరకు గుళికాకాలం తె. 5:44 నుండి ఉ. 7:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు తె. 4:33 నుండి ఉ. 6:20 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


## 112.. ఎమర్జెన్సీ నంబర్ ఇదే!

**దేశవ్యాప్తంగా ఒకే అత్యవసర సేవ.. 3 నెలల్లోగా అమలు చేయాలి.. రాష్ట్రాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు**

ఒక్కో రాష్ట్రంలో.. ఒక్కో అత్యవసర సేవకు ఒక్కో ఎమర్జెన్సీ నంబర్ ఉన్నాయి.. దీంతో, బాధితులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది.. అయితే, దేశవ్యాప్తంగా అత్యవసర సేవల కోసం ఒకే హెల్ప్‌లైన్ నంబర్ '112'ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశంలో పోలీసులకు 100, అగ్నిమాపక సేవలకు 101, అంబులెన్స్ సేవలకు 102 మరియు 108, హైవే అత్యవసర సేవలకు 1033, మహిళల భద్రత కోసం 1091 వంటి వేర్వేరు నంబర్లు ఉపయోగిస్తున్నారు. అయితే ప్రమాదాలు లేదా వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఈ వేర్వేరు నంబర్లు ప్రజల్లో గందరగోళానికి తరువాయి 2 వ పేజీలో...




## వ్యభిచారం.. లీగల్!

**సెక్స్ వర్కర్లకూ అన్ని హక్కులు.. సమ్మతితో చేస్తే నేరం కానే కాదు.. సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు**

సెక్స్ వర్కర్లకు సంబంధించి సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. వ్యభిచారం అనేది కూడా ఒక వృత్తేనని... మిగిలిన వృత్తుల వారికి ఉన్నట్లే.. సెక్స్ వర్కర్లకు కూడా చట్టప్రకారం.. అన్ని హక్కులు, గౌరవం ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దేశంలోని సెక్స్ వర్కర్ల హక్కులు, వారి రక్షణకు సంబంధించిన కేసు విచారణలో భాగంగా శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం ఈ సంచలన తీర్పును ఇచ్చింది.

న్యూఢిల్లీ: రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం... ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు అలాగే వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు.. వారికి కూడా వర్తిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. లైంగిక దోపిడీ కోసం మానవ అక్రమ రవాణా లేదా లైంగిక వృత్తికి సంబంధించిందా? కాదా? అనేది నిర్ధారణకు 'సమ్మతి' అనేది కీలకమైన అంశమని జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు, జస్టిస్ జేబీ పార్ధీవాలా, జస్టిస్ మహాదేవన్‌ల త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు శుక్రవారం తీర్పు చెప్పింది. ఈ తీర్పులో భాగంగా సెక్స్ వర్కర్లు కూడా భారత దేశ తరువాయి 2 వ పేజీలో...



## ఎబోలాతో 223 మంది మృతి

**కాంగోలో మహమ్మారి విజృంభణ**

న్యూఢిల్లీ: ఆఫ్రికాలో ఎబోలా మహమ్మారి ఆందోళన పెట్టిస్తోంది. రోజురోజుకు కేసులు పెరగటంతో పాటు మృతుల సంఖ్య కూడా పెరిగిపోతుంది. కాంగోలా రెండు వారాల్లోనే 906 కేసులు నమోదు కాగా 223మంది మరణించారు. వ్యాధి సోకిన -2 వ పేజీలో...



# దైవం పేరుతో.. దోపిడీ

**అదనపు డబ్బుతో స్పెషల్ దర్శనాలు.. శాస్త్రం చెప్పిందా?**

**ప్రత్యేక దర్శనాలపై మద్రాస్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు**

**వీఐపీ దర్శనాల కల్చర్‌పై న్యాయస్థానం మొట్టికాయలు**

**మంత్రులు, ఎమ్మెల్యేల ప్రత్యేక దర్శనాలపై మండిపాటు**

ఆలయాల్లో కొనసాగుతున్న వీఐపీ దర్శనాల కల్చర్ మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. దేవుడి ముందు అందరూ సమానమే అని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎప్పుడైనా దేవాలయాల్లోకి వెళ్లి ప్రత్యేక దర్శనాలు చేయించుకోవడం మంచిది కాదని కోర్టు స్పష్టం చేసింది. వీఐపీల కోసం దేవుడు ఎదురుచూస్తూ ఉండాలా? అని ఘాటుగా ప్రశ్నించింది. జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ వి లక్ష్మీనారాయణన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హైకోర్టులో ఈ అంశంపై విశ్వ హిందూ పరిషత్ ఉత్తర తమిళనాడు విభాగం అధ్యక్షుడు పీ చొక్కలింగం దాఖలు చేశారు.

చెన్నై: ఆలయాల్లో వీఐపీ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలు రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు ఈ విధంగా వ్యాఖ్యానించింది. అయితే వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, కొత్తగా వివాహం జరిగిన జంటలకు, రాష్ట్రపతి వంటి రాజ్యాంగబద్ధ హోదా కలిగిన వారికి మినహాయింపు ఇవ్వవచ్చని పిటిషన్‌లో పేర్కొన్నారు. మే 15న తిరుపరంకుండ్రం సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఒక మంత్రి దర్శనం కోసం ఆలయ సమయాన్ని పొడగించారనే ఆరోపణలపై కోర్టు గతంలో వివరణ కోరింది. అయితే ఆలయ తరువాయి 2 వ పేజీలో...




## మూడ్నెల్లు దాటితే మంచిగుండదు!

**హైకోర్టులకు సుప్రీం కోర్టు ఆదేశాలు**

తీర్పుల వెల్లడిలో జరుగుతున్న జాప్యాన్ని నివారించటానికి సుప్రీం కోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఆయా రాష్ట్రాల హైకోర్టులకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. రిజర్వ్ చేసిన తీర్పులను హైకోర్టులు మూడు నెలల్లో వెల్లడించాలని పేర్కొంది. దీనిని ప్రతీ హైకోర్టు ఖచ్చితంగా కట్టుబడి ఉండాలని తెలిపింది.

న్యూఢిల్లీ: జార్ఖండ్ రాష్ట్ర హైకోర్టులో తీర్పుల వెల్లడి, వెబ్ సైట్ లో వాటి అప్ లోడింగ్ లో జరుగుతున్న సుదీర్ఘ జాప్యంపై దాఖలైన పిటిషన్ ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. అనంతరం తీర్పును వెలువరిస్తూ ఆయా రాష్ట్రాల హైకోర్టులు రిజర్వ్ చేసిన తీర్పులను తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,606 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,810 |

## బాకీ కట్టిన సర్కారు

**ఉద్యోగులకు రూ.2 వేల కోట్లు విడుదల**

**పెండింగ్ బకాయిలు చెల్లింపు.. రిటైర్డ్ ఉద్యోగులకు గుడ్ న్యూస్**



ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లిస్తానని ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిల చెల్లింపునకు రూ.2 వేల కోట్లను తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): చాలా కాలంగా ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కేవలం 100 రోజుల్లోనే రూ.6 వేల కోట్లు విడుదల చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా.. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తరువాయి 2 వ పేజీలో...



## పేదోళ్ల గూడు ఖరారు

**లక్ష ఇళ్ల నిర్మాణం.. 12వేల ఫ్లాట్లకు జీఓ జారీ**

**హైదరాబాద్‌లో నెరవేరనున్న పేదల సొంతింటి కల**

హైదరాబాద్‌లో (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) క్యూర్ స్కీమ్ కింద లక్ష ఫ్లాట్లను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ మహానగర పరిధిలో నివసిస్తున్న దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కీలక అడుగు వేసింది. క్యూర్ పరిధిలో అందుబాటు ధరల్లో ఫ్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా లో ఇన్‌కమ్ గ్రూప్ (ఎల్ఐజీ), మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ (ఎంఐజీ) ఫ్లాట్లను నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): ఈ ప్రతిష్టాత్మక పథకం కింద అర్హులైన దిగువ, మధ్య తరగతి ప్రజల కోసం లక్ష ఫ్లాట్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే ఈ లక్ష ఫ్లాట్ల నిర్మాణాన్ని ఒకేసారి కాకుండా.. దశలవారీగా నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి విడత కింద.. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా -2 వ పేజీలో...

### విశ్వవాణి



చైనాలో 8 అంకెను అత్యంత అదృష్టంగా భావిస్తారు. మాండరిన్ భాషలో అది సంపద అనే పదానికి దగ్గరగా వినిపిస్తే, కాంటనీస్‌లో అదృష్టం అనే అర్థాన్ని ఇస్తుంది. ఓ వ్యక్తి ఆ నమ్మకంతోనే '88888' అనే నంబర్ ప్లేట్ కోసం 10 లక్షల యువాన్లు ఖర్చు చేశాడు. అయితే, ఆ నంబర్ ప్లేట్‌తో కారు రోడ్డెక్కిన మొదటి రోజే పోలీసులు అతన్ని 8 సార్లు ఆపారు. అంత ఖరీదైన, ప్రత్యేకమైన నంబర్ ప్లేట్ నకిలీ అయి ఉంటుందని వారు అనుమానించారు. ప్రతి సారి అతను డాక్యుమెంట్లు చూపించి ఆ ప్లేట్ అసలైనదేనని నిరూపించాల్సి వచ్చింది. ఆ ప్లేట్ అసలైనదేనని తెలుసుకున్న పోలీసులు ప్రతిసారి షాక్ అయ్యారు.

## పుతిన్ యవ్వనవీణ!

**వయసును మళ్లించేందుకు ఆరాటం**

**రూ.21 లక్షల కోట్లతో భారీ ప్రాజెక్ట్**



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన వయసును వెనక్కి మళ్లించుకోడానికి ఏకంగా 26 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.21 లక్షల కోట్లు) భారీ బడ్జెట్‌తో వినూత్న ప్రాజెక్ట్‌ను చేపట్టినట్లు తెలిసింది. వాల్ స్ట్రీట్ జర్నల్ సమాచారం ప్రకారం.. ప్రభుత్వ ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాజెక్ట్‌లో బయో-ప్రింటింగ్ , జెనోట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యాధునిక పద్ధతులపై పరిశోధనలు జరుగుతున్నాయి.

న్యూయార్క్/మాస్కో: బయో-ప్రింటింగ్ అంటే 3డీ-ప్రింటర్ల సహాయంతో జీవ కణాలను తయారుచేయడం కాగా.. జెనోట్రాన్స్‌ప్లాంటేషన్ అంటే చిన్న పందుల శరీరాల్లో మానవ అవయవాలను అభివృద్ధి చేయడం. ఈ ప్రాజెక్ట్‌తో దీర్ఘాయువు, వృద్ధాప్యాన్ని జయించేందుకు పరిశోధనలు చేస్తోన్న జెఫ్ బెజోస్, సామ్ ఆల్ట్‌మన్, బ్రయాన్ జాన్సన్‌ల సరసన పుతిన్ కూడా చేరారు. జన్యు చికిత్స కూడా ఉన్న ఈ ప్రాజెక్ట్ 2024లో ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో లక్షలాది మందిని కాపాడాలని రష్యా లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు సాధించిన విజయాలలో బయో-ప్రింటింగ్ ద్వారా మానవ మృదులాస్థి తరువాయి 2 వ పేజీలో...



## నైరుతి.. లేదు ఆచూకీ!

**ఆలస్యం కానున్న రుతుపవనాలు.. ఐఎండీ తాజా అప్‌డేట్**

న్యూఢిల్లీ/హైదరాబాద్/విశాఖపట్నం, మే 29 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా మాడుపగిలే ఎండలు, తీవ్రమైన ఉక్కబోత, వడగాల్పుల తో జనం అల్లాడిపోతున్నారు. నైరుతి రుతుపవాలు ఎప్పుడొస్తాయా అని ఎదురుచూస్తోన్న జనాలకు ఈ ఎండల నుంచి ఇప్పుడప్పుడే ఉపశమనం లభించేలా కన్పించడం లేదు. రుతుపవనాల రాక మరింత ఆలస్యం కానుందని భారత వాతావరణ విభాగం తాజాగా పేర్కొంది. ఇవి జూన్ 4, 5 తేదీల్లో కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేస్తోంది. ముందుగా మే 26 నాటికి నైరుతి భారత్‌ను పలకరించే అవకాశం ఉందని అంచనా తరువాయి 2 వ పేజీలో...



## శ్రీవాణి టికెట్లకూ అడ్వాన్స్ బుకింగ్

**జూన్ 10 నుంచే అమలు: టీటీడీ**

తిరుమల, మే 29 (ఈవార్తలు): శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన టిక్కెట్ల జారీలో తిరుమల తిరుపతి దేవస్థానం ( టీటీడీ ) పలు మార్పులు చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను అందుబాటులో ఉంచుతోన్న టీటీడీ.. ఇందులో 500 టికెట్లను అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. వీటిని మూడు నెలల ముందే బుక్‌చేసుకోవచ్చు. -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

30.5.2026

మేషం: అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు రాణిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తిచేస్తారు. గృహమున చిక్కులు తొలగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృషభం: ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. అవసరానికి ధనసహాయం లభిస్తుంది. పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి.

మిధునం: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలలో ఎంత కష్టించినా ఫలితం ఉండదు. వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగుతాయి. ఉద్యోగాలు నిరాశాజనకంగా ఉంటాయి.

కర్కాటకం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి విజయం సాధిస్తారు. కుటుంబ విషయాలలో ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

సింహం: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. గృహనిర్మాణ ప్రయత్నాలలో ఆటంకాలు కలుగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు మందగిస్తాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది.

కన్య: ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత రాణిస్తారు.

తుల: వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ పెద్దలతో చిన్నపాటి వివాదాలు జరుగుతాయి. ఇంటాబయట కొందరి ప్రవర్తన మానసిక చికాకు కలిగిస్తుంది. బంధువర్గం నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారమున పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

వృశ్చికం: ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. కొన్ని వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

ధనస్సు: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. అనుకున్న పనుల్లో అవాంతరాలు తప్పవు. నూతన ఋణయత్నాలు చేస్తారు. వ్యాపార విషయంలో కొంత జాగ్రత్త అవసరం. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి పెరుగుతుంది.

మకరం: స్నేహితులతో మాటపట్టింపులు ఉంటాయి. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. వాహన ప్రయాణ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు కొంత మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

కుంభం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. ముఖ్యమైన పనులలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. మిత్రుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి.

మీనం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ధన పరంగా చికాకులు తొలగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా ఉంటాయి. దూరపు బంధువుల నుండి శుభవార్తలు వింటారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారమున అనుకూలత కలుగుతుంది. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది.

# నైరుతి.. లేదు ఆచూకీ!

మొదటి పేజీ తరువాయి

వేసింది. కానీ, ఈసారి మాత్రం సూపర్- ఎల్‌నినో, వాతావరణ మార్పుల ప్రభావం గట్టిగానే ఉండటంతో ఐఎండీ అంచనాలు తారుమారయ్యాయి. మే 16 నాటికే అండమాన్ సముద్రంలోకి ప్రవేశించినా.. అక్కడ నుంచి నెమ్మదిగా కదులుతుండటంతో రాక మరింత ఆలస్యమవుతోంది. కేరళను తాకిన మూడు నాలుగు రోజుల తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంది. గతేడాది, అంచనాలకు మించి 8 రోజుల ముందుగానే మే 24న కేరళ తీరాన్ని తాకాయి. ఆ తర్వాత రెండు రోజుల్లోనే తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించాయి. ఇక, ఈ ఏడాది రుతుపవన కాలంలో వర్షపాతం సాధారణం కన్నా తక్కువ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ ఇప్పటికే ప్రకటించింది. ఐఎండి ప్రకారం.. వాయువ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, దక్షిణ ద్వీపకల్పంలోని తూర్పు భాగాలు, దానికి ఆనుకొని ఉన్న ప్రాంతాలు, తూర్పు తీరంలో అక్కడక్కడా ఉన్న ప్రాంతాలు మినహా, దేశంలోని మిగతా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. జూన్ 2026 నాటికి దేశవ్యాప్తంగా దీర్ఘకాల సగటులో 92 శాతం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. జూన్‌లోనూ ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్, హర్యానా, పంజాబ్, బిహార్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. జూన్‌లోనూ వడగాల్పులు వీయడం వల్ల ప్రజారోగ్యం, నీటి లభ్యత, విద్యుత్ వినియోగం, నిత్యావసర సేవలపై గణనీయమైన ప్రభావం చూపొచ్చు. అలాగే, వృద్ధులు, పిల్లలు, కార్మికులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఎక్కువ కాలం పాటు తీవ్రమైన వేడికి గురికావడం వల్ల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. నిరంతరంగా అధిక ఉష్ణోగ్రతల వల్ల మౌలిక సదుపాయాలు, వనరుల నిర్వహణ వ్యవస్థలపై కూడా అదనపు ఒత్తిడి పడుతుందని, ఊహించిన పరిస్థితుల దృష్ట్యా, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఐఎండీ సూచించింది.



## పేదోళ్ల గూడు ఖరారు

మొదటి పేజీ తరువాయి

12 వేల ఫ్లాట్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు హౌసింగ్ బోర్డుకు రేవంత్ రెడ్డి సర్కార్ అనుమతులు మంజూరు చేసింది. ఈ లక్ష ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా అత్యంత నిరుపేదలు, దిగువ వర్గాల వారికి లబ్ధి చేకూర్చేలా ఎల్ఐజీ ఫ్లాట్ల లబ్ధిదారులకు రేవంత్ రెడ్డి సర్కార్ భారీ ఉపశమనం కల్పించనుంది. వారికి ఫ్లాట్లతోపాటు భూమి యూడీఎస్ ఇవ్వడం, అదనంగా మరో రూ.5 లక్షల ఆర్థిక సబ్సిడీని కూడా ప్రభుత్వం అందించనుంది. దాని వల్ల సామాన్యుడికి కూడా ఫ్లాట్ కొనుగోలు చేయడంలో ఆర్థిక భారం తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

## బాకీ కట్టిన సర్కారు

మొదటి పేజీ తరువాయి

తాజాగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా.. శుక్రవారం తొలి విడతగా రూ.2 వేల కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలక బకాయిలు మొత్తం ప్రభుత్వం పూర్తిగా చెల్లించినట్లు అయింది. దీంతో రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను మొత్తంగా 100 శాతం క్లియర్ చేశారు. అదే సమయంలో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి 2025 మే వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను అన్నింటినీ పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని అధికారులు వెల్లడించారు. ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4 వేల కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా వారి అకౌంట్లలో జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.

## దైవం పేరుతో...దోపిడీ

మొదటి పేజీ తరువాయి

సమయాన్ని పొడగించలేదని తమిళనాడు ప్రభుత్వం నివేదిక సమర్పించింది. పూర్తిగా కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని కోరగా, కోర్టు 6 వారాల సమయం ఇచ్చింది. ఈ కేసుపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎప్పుడైనా ఆలయంలోకి వెళ్లవచ్చని, దేవుడు వారి కోసం ఎదురుచూస్తాడని భావించకూడదని, వీఐపీ దర్శనాలు ఎందుకు కావాలి? దేవుడు అందరికీ సమానమే కదా అని వ్యాఖ్యానించింది. సనాతన ధర్మం ధనికుడు, పేదవాడు అనే భేదాన్ని చూపదని, అందర్నీ సమానంగా చూస్తుందని, అదనపు డబ్బు తీసుకుని ప్రత్యేక దర్శనాలు కల్పించడం హిందూ శాస్త్రాల్లో ఎక్కడా లేదని పిటిషనర్ పేర్కొన్నారు. ఇది భక్తుల నుంచి డబ్బులు దోచుకోవడమే అని ఆరోపించారు. ద్రవిడ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత వీఐపీ కల్చర్ పెరిగిందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,19,21,25లకు విరుద్ధమని పిటిషనర్ వాదించారు.

## ఎబోలాతో 223 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

ప్రతి పదిమందిలో ఐదుగురు మరణిస్తున్నారు. ఎబోలా వైరస్ సోకినవారిలో బతికే అవకాశం 50 శాతం మాత్రమే ఉంటుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరిస్తోంది. మరోవైపు కాంగో సరిహద్దు దేశం ఉగాండాలో కూడా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే ఎబోలా వ్యాప్తితో పొరుగుదేశాలు హైఅలర్ట్ ప్రకటించాయి. ఎబోలా చికిత్సలో ప్రస్తుతం మూడు రకాల మందులను వినియోగిస్తున్నారు. మహమ్మారి చికిత్సపై క్లినికల్ ట్రయల్స్ సైతం నిర్వహిస్తున్నారు. ట్రయల్స్ పూర్తయ్యాక వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని డబ్ల్యూహెచ్ ఓ చెబుతోంది. ప్రస్తుతం వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడం ఆఫ్రికా దేశాలకు పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు ఆఫ్రికా నుండి ఇతర దేశాలకు వెళుతున్న వారికి సైతం లక్షణాలు ఉండటం ఆందోళనకరంగా మారింది. దీంతో అలా వెళుతున్నవారిని క్వారంటైన్ లో పెట్టి చికిత్స అందిస్తున్నారు.

# పుతిన్ యవ్వనవీణ!

మొదటి పేజీ తరువాయి

కణజాలం, ఎలుక థైరాయిడ్ గ్రంథిని సృష్టించడం ముఖ్యమైనవి. ఈ దశాబ్దం ముగిసే సమయానికి మానవ అవయవాలను మార్పిడి చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు పుతిన్ కుమార్తె, ఎండోక్రినాలజిస్ట్, వొరొంత్సోవా, భౌతిక శాస్త్రవేత్త మిఖాయిల్ కోవల్చుక్ నాయకత్వం వహిస్తున్నారు. మానవ శరీర భాగాలను రిపేర్ చేయడం, వాటి స్థానంలో కొత్తవి అమర్చడానికి కూడా సైన్స్ చివరికి ఒక మార్గాన్ని కనుగొంటుందని కోవల్చుక్ నమ్ముతున్నారు. 'అమరత్వం గురించి చర్చించడం కష్టం, కానీ మనిషి అవయవాలను రిపేర్ చేసే సామర్థ్యం నిస్సందేహంగా పెరుగుతుంది' అని కోవల్చుక్ మీడియాతో అన్నారు. వివాదాస్పద ప్రసంగాలు, ప్రకటనలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కోవల్చుక్.. ఒక ప్రసంగంలో కోవిడ్ మహమ్మారి వెనుక అమెరికా ఉందని, తన మాట విని సేవకులుగా ఉండే మానవులను సృష్టించే దిశగా పయనిస్తోందని విమర్శించారు. రష్యాలో బయో-ప్రింటింగ్ పరిశోధనలకు పితామహుడిగా గుర్తింపు పొందిన రష్యన్ శాస్త్రవేత్త అలెగ్జాండర్ ఓస్ట్రోవ్‌స్కీ. ప్రాజెక్ట్‌ను తప్పుబట్టారు. అంతర్జాతీయ జర్నల్స్‌లో ఎలాంటి పీర్-రివ్యూలు లేని కారణంగా, ఈ ప్రకటనలు కేవలం వారి కోరికలు మాత్రమేనని ఆయన అన్నారు. ఉక్రెయిన్‌పై దండయాత్ర తర్వాత రష్యాను విడిచిపెట్టిన ఆయన... 'అక్కడ ఉన్న శాస్త్రవేత్తలు కేవలం నిధుల కోసం పుతిన్ ఏది వినాలనుకుంటున్నారో దాన్నే చెబుతున్నారు' అని విమర్శించారు. ఇక, 73 ఏళ్ల వయసులోనూ పుతిన్.. గుర్రపు స్వారీ, ఐస్ హాకీ ఆడుతూ, జిమ్‌లో కసరత్తులతో చాలా ఉత్సాహంగా ఉంటారు. అయితే, వృద్ధాప్యాన్ని అడ్డుకోవాలనే ఆయన పిచ్చి కోవిడ్ సమయంలో స్పష్టంగా కనిపించింది. ఆ సమయంలో తనను కలవాలనుకునే వారికి ప్రత్యేక డిస్‌ఇన్‌ఫెక్షన్ టన్నెల్స్, రోజుల తరబడి క్వారంటైన్ తప్పనిసరి చేశారు. దీంతో పాటు 'క్రియోథెరపీ' ( మైనస్ 170 డిగ్రీల ఫారెన్‌హీట్ వంటి అత్యంత శీతల ఉష్ణోగ్రతలకు శరీరాన్ని గురిచేయడం)ని కూడా ఎక్కువగా ఇష్టపడతారు. ఇటీవల చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో జరిగిన భేటీలో మైక్ ఆన్‌లో ఉన్న సంగతి మర్చిపోయిన పుతిన్ 'అవయవాల మార్పిడి ద్వారా మానవులు దీర్ఘాయుష్షు సాధించవచ్చు' అని ఆయన మాట్లాడిన మాటలు యాంటీ ఏజింగ్ ప్రాజెక్ట్ ఆయనకు ఎంత ముఖ్యమో బయటపెట్టాయి.



## 112.. ఎమర్జెన్సీ నంబర్ ఇదే!

మొదటి పేజీ తరువాయి

దారితీస్తున్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రోడ్డు భద్రత సంస్థ 'సేవ్‌లైఫ్ ఫౌండేషన్' దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చంద్రకర్‌ల ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ట్రామా కేర్ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ఉన్న జీవించే హక్కుతో నేరుగా సంబంధం కలిగి ఉందని కోర్టు స్పష్టం చేసింది. ప్రమాదాలు లేదా తీవ్ర గాయాల సమయంలో బాధితులు షాక్‌లో ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అటువంటి సమయంలో ప్రతి క్షణం ఎంతో కీలకమని ధర్మాసనం పేర్కొంది. అత్యవసర సహాయం అందడంలో జాప్యం జరిగితే ప్రాణాలను కాపాడే అవకాశాలు తగ్గిపోతాయని, వేగవంతమైన స్పందన ప్రాణరక్షక ఔషధంలా పనిచేస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో మూడు నెలల్లోగా '112' హెల్ప్‌లైన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కోర్టు ఆదేశించింది. అలాగే అమలు పురోగతిపై రెగ్యులర్ కంప్లయన్స్ రిపోర్టులు సమర్పించాలని, ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించింది. సమావేశాల రికార్డులు, పురోగతి వివరాలను అధికారిక పోర్టల్స్‌లో అప్‌లోడ్ చేయాలని కూడా ఆదేశించింది. మరోవైపు దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ అంబులెన్సులను ఏఐఎస్-125 జాతీయ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని కోర్టు పేర్కొంది. ప్రతి అంబులెన్స్‌లో జీపీఎస్, వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి వాటిని నేరుగా '112' నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించింది. దీని ద్వారా అత్యవసర సేవల స్పందన వేగం పెరిగి, బాధితులకు తక్షణ సహాయం అందే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ట్రామా కేసుల కోసం దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన మెడికల్ రెస్క్యూ ప్రోటోకాల్‌ను రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వానికి మూడు నెలల గడువు ఇచ్చింది. అనంతరం రాష్ట్రాలకు అమలుకు అదనపు సమయం ఇవ్వనుంది. అలాగే ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ముందుకొచ్చే వ్యక్తులు పోలీసు విచారణలు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయంతో వెనుకంజ వేస్తున్నారని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి పరిస్థితులు మారాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఒకే ఎమర్జెన్సీ నంబర్ అమలుతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతమైన సహాయం అందే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

## వ్యభిచారం.. లీగల్!

మొదటి పేజీ తరువాయి

పౌరులేనని... వారికి చట్టం ప్రకారం సమాన రక్షణ లభిస్తుందని కోర్టు తెలిపింది. అయితే, స్వచ్ఛందంగా ఈ వృత్తిలో ఉన్నవారిపై పోలీసులు ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. అలాగే సెక్స్ వర్కర్ల పట్ల పోలీసులు క్రూరంగా ప్రవర్తించవద్దని, వారిని శారీరకంగా లేదా మానసికంగా వేధించరాదని కోర్టు ఆదేశించింది. వారికి కూడా గౌరవంగా బతికే హక్కు ఉందని గుర్తుచేసింది. సమ్మతితో సెక్స్ వర్క్ చేయడం నేరం కానప్పటికీ.. బ్రోతల్ హౌస్ నడపడం, మానవ అక్రమ రవాణా వంటివి చట్టప్రకారం నేరమేనని కోర్టు స్పష్టం చేసింది. మైనర్లను ఈ వృత్తిలోకి దించితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఒక సెక్స్ వర్కర్ బిడ్డను ఆ తల్లి నుంచి వేరు చేయకూడదని కోర్టు తెలిపింది. ఆ పిల్లలకు కూడా మంచి విద్య, ఆరోగ్య సదుపాయాలు పొందే హక్కు ఉంటుందని పేర్కొంది. వీరికి రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు, ఆధార్ కార్డులు జారీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మరీ ముఖ్యంగా సెక్స్ వర్కర్లపై జరిగే దాడులు లేదా రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో వారి గుర్తింపు, ఫోటోలు, వివరాలను మీడియా బహిర్గతం చేయకూడదని, వారి గోప్యతను గౌరవించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. మట్నాత్తంగా వృత్తి ఏదైనప్పటికీ ఈ దేశంలో ప్రతి పౌరుడికి గౌరవంగా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పు దేశంలోని లక్షలాది మంది సెక్స్ వర్కర్ల జీవితాల్లో... భద్రతను, సామాజిక గుర్తింపును తీసుకువస్తుందని నిపుణులు, మానవ హక్కుల సంఘాల నేతలు అంటున్నారు. మరి, దీనిని అమలు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉంటుంది.

## మూడ్నెల్లు దాటితే మంచిగుండదు!

మొదటి పేజీ తరువాయి

మూడు నెలల్లో వెల్లడించాలని పేర్కొంది. రెగ్యులర్ బెయిల్ ఉత్తర్వులకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే ట్రయల్ కోర్టులకు అందించాలని తెలిపింది. బెయిల్ పొందిన విచారణ ఖైదీలను అవసరమైన ఫార్మాలిటీస్ పూర్తి చేసి అదే రోజున విడుదల చేయాలని పేర్కొంది. ఇక, న్యాయస్థానాలు తీర్పులను ప్రకటించిన 24 గంటల్లో వాటిని ఆయా హైకోర్టులో అధికారిక వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని సూచించింది. తీర్పులోని ప్రధాన కార్యాచరణ భాగాన్ని ప్రకటించిన తేదీనే ఈ తీర్పు వెల్లడించిన తేదీగా పరిగణించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# శ్రీవాణి టికెట్లకూ అడ్వాన్స్ బుకింగ్


మొదటి పేజీ తరువాయి


అలాగే, మరో 200 శ్రీవాణి టికెట్లను కరెంట్ బుకింగ్ కింద తిరుపతి విమానాశ్రయంలో జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ బుకింగ్ కోటాలో 800 శ్రీవాణి దర్శన టోకెన్లు కేటాయిస్తున్నారు. వీటిలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి టికెట్ కోసం ఎదురుచూస్తున్నవారికి రోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ పేర్కొంది. ఈ సదుపాయం మే 1 2025 నుంచి విరాళం చెల్లించిన దాతలకు వర్తించనుందని తెలిపింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేసే ఈ టిక్కెట్లను మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు వివరించింది. అయితే, ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. ఈ కోటాలో మిగిలితే కరెంట్ బుకింగ్ కింద జారీచేస్తామని పేర్కొంది. ఈ విధానం వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని టీటీడీ స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో శ్రీవాణి దర్శన టికెట్ల బుకింగ్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టే చర్యల్లో భాగంగానే ఈ మార్పులు చేశారు. ఇటీవల టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ.. ఇకపై లక్కీడిప్ విధానాన్ని అమలుచేస్తామని తెలిపారు. ఈ దర్శన టిక్కెట్లను గరిష్ఠంగా 1,500కి మించకుండా చర్యలు తీసుకుంటూనే విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి వంటి విమానాశ్రయాల్లోనూ శ్రీవాణి కోటా జారీచేసే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు. ముందే విరాళాలు చెల్లించి దర్శనం చేసుకోనివారు దాతలు సుమారు 41 వేలమంది వరకు ఉన్నారని, జూన్ నుంచి వీరికి రోజుకు 300 టికెట్ల చొప్పున కేటాయించి బ్యాక్‌లాగ్ లేకుండా చూస్తామని టీటీడీ ఈవో పేర్కొన్నారు.



# అమరావతిలో జయశంకర్ విగ్రహం

## ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ





హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): అమరావతిలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు తెలంగాణ యంగ్ థింకర్స్ ఫోరమ్ కన్వీనర్ రోహిత్ వక్రాల లేఖ రాశారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఆంధ్ర ప్రాంత వ్యక్తుల నూతన విగ్రహాలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో అమరావతి రాజధాని (ఏపీసీఆర్డీఏ) పరిధిలో జయశంకర్ సార్ విగ్రహం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందా చూడాలని మేధావులు, విద్యావంతులు చర్చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పరిధిలో తగిన భూమిని కేటాయించాలని తెలంగాణ యంగ్ థింకర్స్ ఫోరం కన్వీనర్ రోహిత్ వక్రాల కోరారు. జయశంకర్ తన జీవితాంతం ప్రజల ఆకాంక్షల కోసం, ప్రాంతీయ సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడారు. తన రచనలు, ఉపన్యాసాల ద్వారా తెలంగాణ ఉద్యమానికి మేధోపరమైన శక్తిని అందించారు. శాంతియుత, ప్రజాస్వామ్య మార్గాల్లో తెలంగాణ ఉద్యమం చేశారు. నేడు తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాలు కూడా భాష, చరిత్రను పంచుకుంటూ అభివృద్ధి పథాల్లో పురోగమిస్తున్నాయి. ఈ క్రమంలో రెండు రాష్ట్రాలు తమ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి. ఈ నేపథ్యంలో అమరావతిలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమనేది ప్రజాస్వామ్య పరిపక్వతను, ఏపీ, తెలంగాణ ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని ప్రతిబింబిస్తుంది. పరిపాలనా పరంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ మహనీయులు, మేధావుల కృషిని ఏపీ కూడా కొనియాడాల్సిన అవసరం ఉంది. ఏపీ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన జయశంకర్ విగ్రహాన్ని నెలకొల్పడంతో.. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సామరస్యానికి ఒక దిక్సూచిగా నిలుస్తుంది. ఈ విషయంలో చొరవ తీసుకుని అమరావతిలో 10 అడుగుల ఎత్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలాన్ని కేటాయించాల్సిందిగా హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నామని రోహిత్ వక్రాల పేర్కొన్నారు.

## రైతులకు 3 గంటలు చాలు

### 24 గంటల కరెంట్ అవసరం లేదు

**రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి 24 గంటల కరెంట్ అవసరం లేదు.. 3 గంటల కరెంట్ చాలు అని కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి పేర్కొన్నారు. రైతు డిస్కం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, దీని వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. రైతు డిస్కంపై టీజీఈఆర్సీ నిర్వహించిన బహిరంగ విచారణ సమావేశానికి కోదండ రెడ్డి హాజరై కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు.. తెలంగాణ ప్రాంతంలో ఒకప్పుడు మోటబావులు, గొలుసుకట్టు చెరువులు వీటి ద్వారా నీరు తోడుకుని వ్యవసాయం చేసేవారు. ఆ రకంగా దేశానికి ఆహారం అందించి నెహ్రూ లాంటి పెద్దల చేత రైతు దేశానికి వెన్నెముక, రైతు అన్నదాత అని ప్రశంసించిన సందర్భాలను గుర్తు చేస్తున్నాను. ఈ రోజు తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం కమిషన్‌కు దరఖాస్తు పెట్టుకున్న సందర్భంగా ఈ వ్యవస్థ ఏర్పాటు చేయడమనేది ఒక రైతుగా, తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్‌గా నేను సమర్థిస్తున్నాను. దీంట్లో ఏదైనా ఒక వ్యవస్థ కొత్తగా ఏర్పాటు చేసినప్పుడు అన్ని సంపూర్ణంగా ఏర్పాటు చేయలేం. అందులో అనేక అవకతవకలు ఉంటాయి. అనుభవరీత్యా సరిచేసుకుంటూ పోతాం. విద్యుత్ పంపిణీ సంస్థలో ఏవైనా లోపాలుంటే సరిదిద్దుకునేందుకు అవకాశం ఉంది. ఆ సూచనలు చేయమని మనవి చేస్తున్నా' అని కోదండ రెడ్డి పేర్కొన్నారు.

## 2022 ఏఈలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): తెలంగాణలో నాలుగేళ్ల క్రితం ఏఈ ఉద్యోగాల్లో చేరిన వారికి హైకోర్టు షాకిచ్చింది.. వారందరికి నోటీసులు జారీ చేసింది. 2022లో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఇంజినీర్లుగా ఉద్యోగాలకు బీటెక్/బీఈ అభ్యర్థుల్ని ఎంపిక చేయడంపై హైకోర్టులు పిటిషన్ దాఖలైంది. ఈ అంశంపై కొలకాని శశికుమార్, మరో 8 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె శరత్ విచారణ జరిపారు. 2022 నోటిఫికేషన్‌కు సంబంధించి మొత్తం 787 తాత్కాలికంగా ఎంపికయ్యారని పిటిషనర్ల తరఫు లాయర్ కోర్టుకు వివరించారు. ఉద్యోగాల భర్తీలో 173 మందికి నిర్దేశించిన డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ అర్హత ఉందన్నారు. మిగిలిన 614 మంది కనీస అర్హత లేకుండా 6 ఇంజినీరింగ్ శాఖల్లో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే హైకోర్టు ఇచ్చే ఉత్తర్వులు 614 మందికి వర్తింపజేయాల్సి ఉందన్నారు. 'ఇప్పటికే వీరందరి ఎంపిక పూర్తయింది.. ఈ కేసులో కోర్టు ఇచ్చే ఉత్తర్వులు ఎంపికైన అభ్యర్థులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి వారి వాదనలు వినకుండా ఉత్తర్వులు ఇవ్వలేము' అని న్యాయమూర్తి చెప్పారు. ఈ మేరకు ఈ వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ శరత్.. 65 మందిని ప్రతివాదులుగా చేర్చడానికి అనుమతించారు. 2022 నోటిఫికేషన్ వివిధ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లలో భర్తీ చేయగా.. ఈ ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ఇంజినీరు, మున్సిపల్ ఏఈ, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌లు.. కనీస అర్హత అయిన డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ లేకుండా బీటెక్/బీఈ డిగ్రీలు లేవన్నారు. ఈ మేరకు 614 మంది తరఫున ఆయా శాఖల్లో ఉన్న 65 మందికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీచేసింది. ప్రతివాదులుగా చేర్చడానికి హైకోర్టు అనుమతించింది.. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను జూన్ 25కు వాయిదా వేశారు.

## చాంద్రాయణగుట్టలో 3 కొత్త రిజర్వాయర్లు

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు):పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కొత్తగా మూడు తాగునీటి రిజర్వాయర్లు నిర్మించడానికి ప్రభుత్వం రూ.50కోట్లకు పరిపాలన మంజూరు ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ రిజర్వాయర్లతో బండ్లగూడ ప్రాంతంలో మొఘల్ కాలనీ, క్రిస్టల్ టౌన్‌షిప్ (క్రిస్టల్ కాలనీ) కోహినూర్ గోల్డ్ స్టోన్ (కోహినూర్ కాలనీ), లేక్‌వ్యూ కాలనీ, మదీనా కాలనీ, గోల్డెన్ హిల్స్, హనుమాన్ టెంపుల్ ఏరియా (కృష్ణారెడ్డి నగర్) కాలనీలకు తాగునీటి సరఫరా పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. 2.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం, 15 మీటర్ల ఎత్తు కలిగిన 3 కొత్త ఎలివేటెడ్ రిజర్వాయర్లతోపాటు క్లోరిన్ గదులను నిర్మించనున్నారు. లేక్‌వ్యూ హిల్స్ రిజర్వాయర్, బాలాపూర్ క్యాంపస్ రిజర్వాయర్, కృష్ణారెడ్డి నగర్ రిజర్వాయర్ (హనుమాన్ గుడి సమీపంలో) నిర్మించనున్నారు.

## రెరా చైర్మన్ కోసం నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ మండలి(టీజీరెరా) చైర్మన్ పోస్టు భర్తీ చేయడానికి ప్రభుత్వం శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను సపోర్టింగ్ డాక్యుమెంట్స్ పాటు జూన్ 8వ తేదిలోగా అందజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డవలప్ మెంట్ డిపార్ట్ మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆఫీసులో అందజేయాలని కోరారు. ఇదిలా ఉండగా రెరా చైర్మెన్ పదవికి డాక్టర్ ఎన్. సత్యనారాయణ(రిటైర్డ్ ఐఏఎస్) అనారోగ్య కారణాల రీత్యా రాజీనామా చేయడంతో పోస్ట్ ఖాళీ అయింది. అయితే రెరా కార్యక్రమాలను కొనసాగించడానికి ఇన్ చార్జి చైర్మెన్ గా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డవలప్ మెంట్ డిపార్ట్ మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి చైర్మన్ పోస్టు భర్తీచేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది.

# రూ.80 వేల క్యాన్సర్ టెస్ట్ ఫ్రీ

### నిమ్స్‌లో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్.. చివరిదశ క్యాన్సర్ బాధితులకూ చికిత్స



హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వచ్చింది. రూ.80 వేల విలువైన నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్జీఎస్) పరీక్షలను ఉచితంగానే నిర్వహించనున్నారు. ఇది స్టేజ్-4 క్యాన్సర్ దశలో ఉన్నవారికి కూడా ఉపయోగపడుతుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వందల మంది క్యాన్సర్ రోగుల శాంపిళ్లను ఈ ఎన్జీఎస్ మిషన్‌పై పరీక్షించగా.. వారందరికీ అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ అందించనున్నారు. ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఇలాంటి పరీక్షలను ప్రారంభించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ ఒక్క పరీక్షకే రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవతుందని.. ఆరోగ్య శ్రీ పథకం కింద క్యాన్సర్ రోగులకు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కొన్ని ఏళ్ల క్రితమే ఈ ఎన్జీఎస్ పరీక్షలను ప్రయోగాత్మకంగా చేపట్టగా.. ఇప్పుడు అవి సక్సెస్ కావడంతో శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. తొలి విడతలో వందల మంది క్యాన్సర్ రోగుల శాంపిళ్లను ఈ ఎన్జీఎస్ మిషన్‌పై పరీక్షించారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు వారందరికీ అత్యాధునిక క్యాన్సర్ చికిత్స అందించనున్నారు. ఒక గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఇలాంటి అత్యాధునిక జన్యుపరీక్షను ప్రారంభించడం తెలంగాణ రాష్ట్రంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చయ్యే ఈ ఎన్జీఎస్ పరీక్షను ఆరోగ్య శ్రీ పథకం కింద పేదలకు ఉచితంగా చేయనున్నట్లు - సంబంధిత అధికారులు పేర్కొన్నారు. గతంలో ఒకే రకమైన క్యాన్సర్ సోకిన రోగులకు ఒకేరకం మెడిసిన్ ఉండేది. అయితే అది కొంతమందికి పని చేయకపోవడంతో.. రోగం తగ్గడం సంగతి అటుంచితే.. అది మరింత ఎక్కువ అయ్యేది. రోగుల్లో జన్యులోపం వేర్వేరుగా ఉండటమే దీనికి కారణమని డాక్టర్లు గుర్తించారు. అయితే ఈ జన్యు తేడాలను ఎన్జీఎస్ పరీక్షతో తెలుసుకోవచ్చు. క్యాన్సర్ కారణంగా ఏ జన్యువు పాడైంది.. ఏ జన్యువు ఎక్కువ మ్యుటేషన్‌కు గురై.. క్యాన్సర్ రావడానికి కారణం అయిందో కచ్చితంగా గుర్తించవచ్చని డాక్టర్లు చెబుతున్నారు.

# 33 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ

**రైతు డిస్కంపై కల్వకుంట్ల కవిత డిమాండ్**

**ఏసీల్లో తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించొద్దు**

**ప్రభుత్వంపై టీఆర్ఎస్ చీఫ్ మండిపాటు**



హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): రైతు డిస్కమ్ పేరుతో ఈ ప్రభుత్వం రైతులను పచ్చి దగా చేస్తోందని.. నిజంగా ఈ నిర్ణయం మంచిదయితే ఆరు నెలల నుంచి ఎందుకు రహస్యంగా ఉంచిందని, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ ఎందుకు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత ప్రశ్నించారు. 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ జరపాలని డిమాండ్ చేశారు. రైతు డిస్కమ్ ఏర్పాటుపై తెలంగాణ ఈఆర్సీ నిర్వహించిన ప్రజా అభిప్రాయ సేకరణ సమావేశంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. అనంతరం కవిత మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు డిస్కం పేరిట విద్యుత్ సంస్కరణలు తేవాలని ప్రయత్నిస్తుంది. ఈ ప్రయత్నాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. గత ఆరు నెలలుగా ప్రభుత్వం రైతు డిస్కం పేరు మీద ఒక కంపెనీ ఏర్పాటు చేయడం.. సెపరేట్ డిస్కం కింద గుర్తించాలని ఈఆర్సీకి అప్లికేషన్ పెట్టుకోవడం వంటివి ప్రజలకు చెప్పకుండా దొంగచాటుగా చేస్తూ వచ్చారు. ఇవాళ ఈఆర్సీ పబ్లిక్ హియరింగ్ కోసం పిలవడంతోనే ఇది ప్రజల మధ్యకు వచ్చింది అని కవిత పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఏసీ గదులల్లో మీటింగులు పెట్టి యావత్ తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించడం సరికాదు. 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ జరపాలని డిమాండ్ చేస్తున్నాం. ఈఆర్సీ లైసెన్స్ ఇవ్వకముందే జూన్ 2 నుంచి ఫంక్షన్ అయితదని సీఎం చెప్పడం కరెక్టు పద్ధతి కాదు. ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పెట్టిన అప్లికేషన్లను రిజెక్ట్ చేయాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ చైర్మన్‌ను కోరుతున్నాం అని ఆమె అన్నారు.

# ఒక్క ఓటూ పోవద్దు: రేవంత్ రెడ్డి

**గాంధీభవన్‌లో 'సర్'పై సమీక్ష**



హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): ఓటరు సమగ్ర సవరణ (సర్) అంశంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కారణంగా సామాన్యులు, పేదలు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్ వల్ల లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులు తీవ్ర సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కొన్ని నియోజకవర్గాల్లో వలసలు ఎక్కువగా జరిగాయని, దీంతో ఓటర్ల జాబితా మార్పుల ప్రభావం తీవ్రంగా ఉండొచ్చని పేర్కొన్నారు. మహిళలు, దళితులు, మైనార్టీల ఓట్లు కూడా తొలగిపోవచ్చనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారంపై పార్టీ నాయకులు పూర్తి అవగాహనతో పనిచేయాలని ఆయన సూచించారు. గతంలో బూత్ ఎన్రోలర్ల సహాయంతో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్‌షిప్ నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే స్థాయి సమర్థతతో ఎస్ఐఆర్‌పై కూడా పని చేయాలని అన్నారు. అత్యధిక సభ్యత్వం నమోదు చేసినవారిని రాహుల్ గాంధీతో సత్కరించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ప్రతి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌లను నియమించి నిరంతర పర్యవేక్షణ చేయాలని, మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలు మరియు 17 లోక్‌సభ స్థానాల్లో ప్రత్యేక బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పూర్తిగా పార్టీ కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. తాను కూడా ప్రతి 10 రోజులకు ఒకసారి కార్యకర్తలను కలుస్తానని, నెలలో మూడు రోజులు పూర్తిగా పార్టీ పనులకు సమయం ఇస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు అందరూ తప్పనిసరిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని, ఎవరికీ మినహాయింపు ఉండకూడదని స్పష్టం చేశారు.

## టీవీవీపీ కమిషనర్‌గా శ్రీనివాస్ ప్రసాద్?

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ అజయ్ కుమార్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయన స్థానంలో కొత్త కమిషనర్ గా నిజామాబాద్ డీసీహెచ్ఎస్ గా పనిచేస్తున్న డా. పి శ్రీనివాస్ ప్రసాద్ నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముగ్గురు సభ్యులతో సీనియారిటీ లిస్ట్ తయారు చేయగా... సీనియారిటీలో ఆయన మొదటి స్థానంలో ఉన్నారని తెలుస్తోంది. 1994లో సర్వీసులో చేరిన శ్రీనివాస్ ప్రసాద్.. 32 ఏళ్ల సర్వీసులో 25 ఏళ్లు మెడికల్ సూపరింటెండెంట్ గా పనిచేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలుమార్లు ఉత్తమ వైద్యుడిగా ఎంపికయ్యారు. మరోవైపు సీనియారిటీ లిస్టులో ఉన్న మిగతా ఇద్దరు వైద్యులు ఏడాది లోపే రిటైర్ అవ్వనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ ప్రసాద్ నియామకం లాంఛనమేనని వైద్య వర్గాలు తెలిపాయి.

## ఇది రేవంత్ మాటే: హరీశ్ రావు

రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు.. 3 గంటల కరెంట్ చాలు అని ఈఆర్సీ ముందు కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. ఇది కోదండ రెడ్డి వ్యక్తిగత అభిప్రాయం కాదు.. ఇది రేవంత్ రెడ్డి మనసులోని ఆలోచన అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడగలరు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టింది. కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోంది' అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## అప్పుడు బాబు.. ఇప్పుడు రేవంత్: జగదీశ్ రెడ్డి

రైతుల పేరు మీద కరెంటు దొంగతనానికి గురవుతుందని.. అందుకే రైతు డిస్కంలు తెస్తున్నామని ప్రభుత్వం చెప్పడం అత్యంత దుర్మార్గమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఆనాడు చంద్రబాబు ప్రభుత్వం రైతులను దొంగలను చేస్తే.. ఇప్పుడు ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి కూడా రైతులను దొంగలను చేసే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఈఆర్సీ చేపట్టిన రైతు డిస్కం ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు డిస్కం అమలైతే ఒక మండలానికి ఒకరు లేదా ఇద్దరే లైన్‌మెన్లు ఉండే పరిస్థితి వస్తుందన్నారు. వేలాది వ్యవసాయ కనెక్షన్లు, వందలాది ట్రాన్స్‌ఫార్మర్ల బాధ్యత ఒక్కరి భుజాలపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## గో బ్యాక్ ఆంధ్రా ఉద్యమం తప్పదు

**కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

హైదరాబాద్, మే 29 (ఈవార్తలు): తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే.. మళ్లా గో బ్యాక్ ఆంధ్రా ఉద్యమం తప్పదని జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌ను జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్టు చేసే ముందు దమ్ముంటే నన్ను కూడా అరెస్టు చేయాలని ఏపీ ప్రభుత్వానికి అనిరుధ్ సవాల్ విసిరారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అనిరుధ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై మాట్లాడే అర్హత పవన్ కల్యాణ్‌కు లేదు. నాగేశ్వర్ చదువుకున్న వ్యక్తి.. రాజకీయ విశ్లేషకులు.. మాజీ ఎమ్మెల్సీ. ఆయన గురించి మాట్లాడడం కాదు.. ఆయన కాలి గోటికి కూడా సరిపోడు పవన్ కళ్యాణ్. పవన్ కళ్యాణ్ ఒక ప్యాకేజ్ స్టార్. చంద్రబాబు ప్యాకేజ్ ఇచ్చిండు కాబట్టి ఆయన తోటి ఉన్నడు. మళ్లీ అమిత్ షా దగ్గరికి పోయి మాట్లాడుకున్నడేమో ప్యాకేజ్. నాగేశ్వర్‌ను అరెస్టు చేయాలనుకుంటున్నారు కదా.. ఆయన ఇంటి ముందు నేను నిలబడుతా.. ఆయనను అరెస్టు చేసే ముందు నన్ను అరెస్టు చేయండి దమ్ముంటే. తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఎవరైనా ఆంధ్రా నుంచి మీరు వస్తే మళ్లా గో బ్యాక్ ఆంధ్రా అని మేం స్టార్ట్ చేసినం అంటే మీరు ఇక్కడ ఉండలేరు అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. మీరంతా తెలంగాణలోనే ఉంటున్నరు కదా.. అన్ని పైసలు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నరు. ఆ పైసలేదో మాకు ఇవ్వండి.. జడ్చర్లలో 5 వేల ఎకరాలు ఇస్తా. 99 ఏండ్లకు లీజు ఇస్తా. ఇక ఇక్కడ్నే ఉన్నట్టు ఉంటది.. ఇక్కడ్నుంచే ఆంధ్రాను పాలించినట్టు ఉంటది మీకు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేదే లేదు మా తెలంగాణోళ్లపైన. ఇంకో డౌట్ కూడా వస్తుంది.. రేపు జగన్ ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే ఆయనకు సపోర్ట్ చేస్తాడేమో అనే డౌట్ కూడా ఉందని పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శనివారం 30-5-2026, జగిత్యాల | www.evarthalu.com


వయ్యారి చిత్రం






## రోమాంచకం.. సందీప్ రెడ్డి వంగా కొత్త అవతారం!

స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తాజాగా తన కొత్త సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్ రివీల్ చేస్తూ ఓ పోస్ట్ షేర్ చేశారు. అయితే.. ఈసారి ఈయన డైరెక్టర్‌గా కాకుండా సమర్పకుడిగా కొత్త అవతారం ఎత్తారు. ఈ చిత్రంలో 'మేము ఫేమస్', 'గోదారి గట్టు' ఫేమ్ యంగ్ హీరో సుమంత్ ప్రభాస్, '8 వసంతాలు' ఫేమ్ బ్యూటీ అవంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తుండగా.. వేణు గోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా రిలీజ్ చేస్తూ.. 'కథనం చెబుతున్నంత సేపు మనస్ఫూర్తిగా నవ్వుకున్నాను. ఈ వినోదం వెనుక బలమైన భావోద్వేగ స్పర్శ కూడా ఉంది. ఈ చిత్రాన్ని నేను మొదటిసారిగా సమర్పిస్తున్నాను. భద్రకాళి పిక్చర్స్ ఒక విలక్షణమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీతో మీ ముందుకు వస్తోందని ప్రకటించడానికి సంతోషంగా ఉంది' అని ఓ పోస్ట్ షేర్ చేశాడు. కాగా.. ఈ సినిమాకు 'రోమాంచకం' అనే టైటిల్ ఫిక్స్ చెయ్యగా.. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌ను జత చేశారు.

## వారణాసి నుంచి మరో లీక్!



మహేష్ బాబు, రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న లేటెస్ట్ మూవీ వారణాసి. ఈ సినిమా షూటింగ్ చాలా వేగంగా సాగుతోంది. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా మెరువనున్నారు. అయితే ఈ భారీ బడ్జెట్ సినిమాకు ఊహించని షాక్ తగిలింది. ఈ సినిమాకు మొదటి నుంచి లీక్ ల బెడద ఎదురు అవుతూనే ఉంది. మొన్న ఒడిస్సా లో జరిగిన తొలి షెడ్యూల్ షూటింగ్ టైంలో కొన్ని సీన్స్ వైరల్ గా మారాయి. ఇప్పుడు కీలకమైన ఉగ్రభట్టి గుహ సన్నివేశానికి సంబంధించిన భారీ సెట్ స్టిల్స్ సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. దీంతో సీరియస్ అయిన జక్కన్న, లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారట. ఇలా ప్రతి సీన్ లీక్ చేస్తే.. ఎలా అని ఇప్పటికే చిత్ర బృందం సభ్యులకు వార్నింగ్ ఇచ్చారట. ఇది ఇలా ఉండగా పాన్ ఇండియా రేంజ్ లో వస్తున్న ఈ సినిమా.. టైం ట్రావెల్, మైథాలజీ నేపథ్యంలో వస్తున్నట్లు టాక్. ఇక ఈ మూవీలో రుద్ర అనే శివ భక్తుడి పాత్రలో మహేష్ బాబు మెరుస్తున్నారు.



## శాశ్వత నిద్రతోనే ఎండ్ కార్డు: మంచు మనోజ్

ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో జోరు పెంచిన మంచు మనోజ్.. పవర్‌ఫుల్ విలన్ క్యారెక్టర్స్‌లో మెప్పిస్తూనే, హీరోగాను సినిమాలు అనౌన్స్ చేస్తున్నాడు. ఇక ఈ హీరో తన బర్త్‌డే సందర్భంగా హీరోగా ఓ మూవీ చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పాటు నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీ చంద్ మలినేని కాంబోలో రాబోతున్న 'ఎన్‌బీకే111'లో కూడా ఓ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నాడు. ఇలా సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియా వేదికగా కూడా అభిమానులకు అందుబాటులో ఉండే ఈ హీరో.. తాజాగా మోటివేషనల్ కామెంట్స్‌తో వార్తల్లో నిలిచాడు. ఈ మేరకు 'జీవితంలో ఏదో ఒక చోట, ఎక్కడో ఒక దగ్గర స్టక్ అయిపోవడం సర్వసాధారణం. అంతే కాదు వచ్చిన అడ్డంకులను అధిగమించగానే, మరొకటి అనివార్యంగా ఎదురవుతుంది. ఒక కష్టం వచ్చిందని దిగులుగా కూర్చుంటే, మీరు ఉన్నచోటనే నిలిచిపోతారు. ఏదో ఒక కష్టం వచ్చింది కదా అని అక్కడే ఆగిపోకూడదు.. జీవితంలో ఇంకా ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉంటాయి. ఒక నిర్దిష్ట వర్గం లేదా హోదాకు చెందిన వారిని మాత్రమే వస్తుంటాయని అందరూ భావించవచ్చు.

## ధనూష్ కీలక నిర్ణయం

కోలీవుడ్ నటుడు ధనుష్ తన పారితోషకం విషయంలో ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. తాజాగా ఆయన 'కర' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు. ఈ సినిమా కోసం ఆయన ఏకంగా రూ.60 కోట్ల పారితోషకం అందుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ చిత్ర నిర్మాణానికి కేవలం రూ.25 కోట్ల మాత్రమే ఖర్చైనట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, ధనుష్‌కు ఉన్న క్రేజ్ కారణంగా ఓటీటీ, శాటిలైట్, మ్యూజిక్ హక్కుల రూపంలో చిత్రానికి మంచి బిజినెస్ జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ధనుష్ 'అమరన్' మూవీ దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం కోసం ఆయన ఏకంగా రూ.70 కోట్ల వరకు పారితోషకం తీసుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలా ధనుష్ పారితోషకం భారీగా పెరుగుతున్న నేపథ్యంలో తన వల్ల నిర్మాతలపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.







## బాలీవుడ్‌లో దేవరకొండ క్రేజీ కాంబినేషన్

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఒకవైపు రణబాలి, మరోవైపు రౌడీ జనార్ధన్ సినిమాల షూటింగ్స్ లో పాల్గొంటూనే, దర్శకుడు శౌర్యవ్ తో మరో కొత్త ప్రాజెక్టుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే ఆ సినిమా అఫీషియల్ అనౌన్స్మెంట్ వెలువడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన వార్త వైరల్ అవుతోంది. తాజాగా విజయ్ దేవరకొండ ముంబైలోని ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ మ్యాడ్ డాక్ ఫిల్మ్స్ ఆఫీస్ బయట కనిపించడం చర్చనీయాంశమైంది. అయితే ఆ మీటింగ్ లో అసలు ట్విస్ట్ ఏంటంటే.. విజయ్ ఒక్కడే కాకుండా దర్శకుడు విక్రమ్ కె కుమార్ కూడా ఆయనతో పాటు కనిపించడం. దీంతో వీరిద్దరి కాంబినేషన్ లో కొత్త సినిమా దాదాపు ఫిక్స్ అయ్యిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. మనం, 24, గ్యాంగ్ లీడర్, హలో వంటి విభిన్న కథా చిత్రాలతో స్క్రీన్ ప్లే మాంత్రికుడిగా గుర్తింపు తెచ్చుకున్న విక్రమ్ కె కుమార్ ఇప్పటికే విజయ్ కు ఓ కథ వినిపించారట.

## జూలై 31న 'సిగ్మా'

తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




## రీమిక్స్ వివాదంలో పూజా హెగ్డే సినిమా

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్.. స్టార్ డైరెక్టర్ ఫర్హాన్ అక్తర్ మధ్య డాన్ విషయంలో జరిగిన వివాదం మరువక ముందే.. ముంబై సినీ వర్గాల్లో మరో భారీ కోర్ట్ వివాదం తెరపైకి వచ్చింది. ప్రముఖ సీనియర్ నిర్మాత వషు భగ్నానీ బాంబే హైకోర్టును ఆశ్రయిస్తూ ఏకంగా రూ. 400 కోట్ల భారీ నష్టపరిహార దావా వేశారు. టాలెంటెడ్ హీరో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటిస్తున్న తదుపరి చిత్రం హై జవానీ తో ఇష్క్ హోనా హై లోని చునరి చునరి క్లాసిక్ సాంగ్ రీమిక్స్ వాడకంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా.. కాపీరైట్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈ పాటను సినిమాలో ఉపయోగించారని వషు భగ్నానీ టిప్స్ మ్యూజిక్, దర్శకుడు డేవిడ్ ధావన్‌లపై లీగల్ బ్యాటిల్‌కు దిగారు. ఈ వివాదాస్పద రీమిక్స్ సాంగ్ ఒరిజినల్ వెర్షన్.. 1999లో సల్మాన్ ఖాన్, కరిష్మా కపూర్ జంటగా వషు భగ్నానీ నిర్మించిన బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రం బీవీ నెం. 1 లోనిదన్న సంగతి తెలిసిందే. ఈ కాపీరైట్ వివాదం నేపథ్యంలో వషు భగ్నానీ బాంబే హైకోర్టును ఆశ్రయించి జూన్ మొదటి వారంలో విడుదల కావాల్సిన హై జవానీ తో ఇష్క్ హోనా హై సినిమా విడుదలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దాంతో పాటు రూ. 400 కోట్ల భారీ పరిహారాన్ని క్లెయిమ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

## పాలరాతి బొమ్మ.. జాన్వీ

జూన్ 4వ తేదీన పెద్ది ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో వరుస ప్రమోషనల్ కార్యక్రమాలను చేపట్టారు చిత్ర బృందం. ఇందులో భాగంగా అందాల తార జాన్వీ కపూర్ సోషల్ మీడియా వేదికగా లేటెస్ట్ ట్రెండీ ఔట్‌ఫిట్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను ఇటు ప్రమోషన్స్ తో సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అనామికా ఖన్నా డిజైన్ చేసిన తెలుపు రంగు ఐవరీ చీరను ధరించింది. తెల్లని పలుచని వస్త్రంపై చక్కటి హెవీ ఎంబ్రాయిడరీ డిజైన్ చేశారు. స్కాల్లప్ లేస్ డీటెయిల్ తో ఈ చీరను పూర్తి చేశారు. దీనికి కాంబినేషన్లో అంతే హెవీగా డిజైన్ చేసిన స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి ఆకట్టుకుంది. ఇక జుట్టును వేవ్ చేసిన ఈమె.. వైట్ గోల్డెన్ మిక్స్ చెవి దిద్దులను ధరించింది. నెక్ ను సింపుల్గా, బోసిగా ఉంచేసిన ఈమె.. ఈ లుక్కులో చూస్తుంటే పాలరాతి బొమ్మలా కనిపిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.





## ముంబైకి హార్దిక్ గుడ్ బై!

ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఏ మాత్రం మెప్పించలేకపోయాడు. వరసగా మూడు సీజన్లలో నిరాశజనక ప్రదర్శనతో ముంబై అభిమానులు, యాజమాన్యం ఆశల్ని వమ్ము చేశాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత జట్టుకు వరసగా సిరీస్‌లు గెలిపించిన ఈ బరోడా స్టార్.. ఐపీఎల్‌లో మాత్రం ముంబైని ఛాంపియన్‌గా నిలపలేకపోయాడు. 19వ సీజన్‌లో ఫ్లాప్ షో కారణంగా.. మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న అతడు వచ్చే సీజన్‌లో కొత్త జట్టుకు ఆడడం ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా.. ఆల్‌రౌండర్‌గా దారుణంగా విఫలమయ్యాడు. స్టార్ ఆటగాళ్లైన రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వైఫల్యం.. ప్రధాన పేసర్ బుమ్రా వికెట్లు తీయకపోవడం ముంబైని ముంచాయి. ఒకింత సమిష్టి వైఫల్యం ఓ కారణమైనా.. సారథి పాండ్యావైపే వేళ్లు చూపిస్తున్నారంతా. ఈ నేపథ్యంలోనే అతడిపై వేటు తథ్యమనే వార్తలు వినిపిస్తున్నాయి. అందుకు బలం చేకూర్చేలా లీగ్ దశ ఆఖర్లో సూర్యకుమార్ యాదవ్.. బుమ్రా టాస్‌కు వచ్చారు. ఆటగాడిగా, నాయకుడిగా తేలిపోయిన పాండ్యా మానసిక ఒత్తిడితోనూ బాధ పడుతున్నాడట. అందుకని.. అతడు ముంబైని వీడాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని సీజన్ మధ్యలోనే యాజమాన్యానికి చెప్పేశాడని తెలుస్తోంది. అయితే.. ముంబై ఫ్రాంఛైజీ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు.



## స్మార్ట్ గ్లాసెస్‌పై బీసీసీఐ బ్యాన్

ఐపీఎల్ క్రికెటర్లకు కొత్త ఆంక్షలు విధించింది బీసీసీఐ. ఈ సీజన్‌లో ఇంకా రెండు మ్యాచ్‌లో మిగిలి ఉన్నాయి. ఇవాళ రాజస్థాన్, గుజరాత్ మధ్య ఎలిమినేటర్ 2 మ్యాచ్ జరగనున్నది. ఇక ఇవాళ్టి విజేతతో ఆదివారం ఆర్సీబీ ఫైనల్ ఆడుతుంది. అయితే ఈ నేపథ్యంలో బీసీసీఐకి చెందిన అవినీతి నిరోధక శాఖ ఓ కీలక ఆదేశం ఇచ్చింది. ఆటగాళు కానీ, మ్యాచ్ అఫీషియల్స్ కానీ స్మార్ట్ సన్‌గ్లాస్‌లు వాడకూడదని ఆదేశించింది. కొత్తగా వస్తున్న స్మార్ట్ సన్‌గ్లాస్‌ల్లో అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ ఫీచర్లు ఉన్నాయని, వాటితో లైవ్ స్ట్రీమింగ్, వీడియో కాలింగ్ చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ పేర్కొన్నది. మొబైల్ డేటా లేదా వైఫై నెట్వర్క్‌తో స్మార్ట్ సన్‌గ్లాస్‌లను దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ తన హెచ్చరికలో తెలిపింది. కొన్ని స్మార్ట్ సన్‌గ్లాస్ కంపెనీలు ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్‌తో మార్కెటింగ్ చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో వాటి వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు బీసీసీఐ చెప్పింది. స్మార్ట్ సన్‌గ్లాస్‌లను ఆడియో-వీడియో రికార్డింగ్ డివైస్‌గా భావిస్తున్నామని బీసీసీఐ తెలిపింది.



## లక్నో కెప్టెన్సీకి పంత్ గుడ్ బై

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి పంత్ వైదొలిగాడు. ఈ విషయాన్ని లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఐపీఎల్-2026లో లక్నో సూపర్ జెయింట్స్ ఘోర ప్రదర్శనకు నైతిక బాధ్యత వహిస్తూ పంత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 'రిషభ్ పంత్ లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ బాధ్యతల నుండి తప్పుకోవాలని నిశ్చయించుకున్నాడు. అతడి అభ్యర్థనను ఫ్రాంచైజీ తక్షణమే ఆమోదించింది. క్రికెట్‌లో ఇలాంటి కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం ఎప్పుడూ సులువు కాదు. ఒక కెప్టెన్‌గా అతడు సూపర్ జెయింట్స్‌కు అందించిన సేవలకు ధన్యవాదాలు తెలుపుతున్నాము. ఇప్పుడు మా దృష్టి అంతా జట్టు ప్రయోజనాల పైనే ఉంది. రాబోయే రోజుల్లో జట్టును మళ్లీ పటిష్టంగా నిర్మించడమే మా లక్ష్యం ' అని లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ డైరెక్టర్ టామ్ మూడీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.





# గుజరాత్ ఘనంగా!

### ఫైనల్ చేరిన గిల్ సేన.. శుభ్‌మన్ సూపర్ సెంచరీ

### వైభవ్ మెరుపులు వృథా.. మళ్లీ తృటిలో శతకం మిస్

**క్వాలిఫయర్ 1లో కంగుతిన్న గుజరాత్ టైటాన్స్.. ఈ సారి రాజస్థాన్‌పై తన ప్రతాపాన్ని చూపించింది. క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ భారీ స్కోర్‌తో సవాల్ విసిరినా లక్ష్యాన్ని ఘనంగా ఛేదిస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుభ్‌మన్ గిల్(104) శతకంతో కదం తొక్కి విజయాన్నందించాడు.**


**సాయి సుదర్శన్(58)తో సెంచరీ భాగస్వామ్యంతో గెలుపు పునాది వేసిన గిల్ ఔటైనా.. ఇంప్యాక్ట్ సబ్ రాహుల్ తెవాటియా(17 నాటౌట్) లాంఛనం ముగించాడు. మే 31 ఆదివారం ఆర్సీబీతో అమీతుమీకి సిద్ధమైంది గుజరాత్. ఎలిమినేటర్‌లో పంజా విసిరిన రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2లో తేలిపోయింది.**

ముల్లన్‌పూర్‌లో వైభవ్ సూర్యవంశీ(96) విధ్వంసంతో 214 రన్స్ కొట్టినా.. బౌలర్ల వైఫల్యంతో ఆ జట్టును ముంచింది. భారీ ఛేదనలో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన శుభ్‌మన్ గిల్() శతకంతో రెచ్చిపోగా మూడో ఫైనల్ ఆడాలనుకున్న రాజస్థాన్ కల చెదిరింది. రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ ఛేదనను గుజరాత్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(104), సాయి సుదర్శన్(58)లు దూకుడుగా మొదలెట్టారు. ఆర్చర్ వేసిన తొలి ఓవర్లోనే నాలుగు ఫోర్లతో 19 రన్స్ రాబట్టారు. అయితే..14 పరుగుల వద్ద ఫెరీరా క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన సుదర్శన్ కెప్టెన్‌తో కలిసి రెచ్చిపోయాడు. ఇద్దరూ బౌండరీలతో చెలరేగగా గుజరాత్ పవర్ ప్లేలో 69 పరుగులు చేసింది. క్రీజునంటుకున్న ఈ జోడీని విడదీసేందుకు పరాగ్ బౌలర్లను మార్చినా లాభం లేకపోయింది. 30 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న గిల్‌ను అనుసరిస్తూ సుదర్శన్ యాభైతో స్కోర్ వేగం పెరిగింది. అయితే.. విజయానికి 48 పరుగులు అవసరమైన వేళ సుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. బ్రిజేశ్ ఓవర్లో బౌండరీకి పంపిన సుదర్శన్ అనూహ్యంగా బ్యాట్ జారిపోయి వికెట్లకు తాకడంతో ఔటయ్యాడు. జడ్డూ ఓవర్లో బౌండరీతో ఈ సీజన్‌తో శతకం సాధించిన గిల్‌ను ఆర్చర్ ఎల్బీగా వెనక్కి పంపాడు. అప్పటికే గెలుపు వాకిట నిలిచిన గుజరాత్ సుందర్(16) వికెట్ కోల్పోయింది. బట్లర్(9 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ రాహుల్ తెవాటియా(17 నాటౌట్)లు గెలిపించారు. దాంతో.. ఉసూరుమంటూ రాజస్థాన్ ఇంటిదారి పట్టగా.. ఆర్సీబీతో టైటిల్ పోరుకు సిద్ధమైంది గుజరాత్.



## వైభవ్ విధ్వంసం

ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై తుఫాన్ ఇన్నింగ్స్ ఆడిన వైభవ్ సూర్యవంశీ(96) క్వాలిఫయర్ 2లో గర్జించాడు. తొలి రెండు ఓవర్లలో రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వని ఈ చిచ్చరపిడుగు తన స్టయిల్ విధ్వంసంతో గుజరాత్ టైటాన్స్ బౌలర్లను బెంబేలెత్తించాడు. టెన్నిస్ ఫోర్ ఆర్మ్ షాట్లతో అలరించిన ఈ కుర్రాడు. రవీంద్ర జడేజా(45 నాటౌట్)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. నాలుగు పరుగుల తేడాతో శతకం చేజార్చుకున్నా భారీ స్కోర్‌కు పునాది వేశాడు. రషీద్ ఖాన్ వేసిన ఆఖరి ఓవర్లో ఫెరీరా(38 నాటౌట్) నాలుగు సిక్సర్లతో విరుచుకుపడగా రాజస్థాన్ ప్రత్యర్థి ముందు రెండొందలకుపైగా లక్ష్యాన్ని నిలిపింది.



## సింధు ఔట్.. సెమీస్‌లో చిరాగ్ - సాత్విక్ ..!

సింగపూర్ ఓపెన్‌లో భారత్‌కు శుక్రవారం మిశ్రమ ఫలితాయి ఎదురయ్యాయి. డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్ ఫైనల్లో అదిరే విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. అయితే.. మహిళల సింగిల్స్‌లో పతకం గెలుస్తుందనుకున్న పీవీ సింధు అనూహ్యంగా ఓటమితో ఇంటిదారి పట్టింది. క్వార్టర్స్‌లో వరల్డ్ నంబర్ 1 చేతిలో సింధు కంగుతిన్నది. ఈ సీజన్‌లో అదరగొడుతున్న సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం సింగపూర్ ఓపెన్ టైటిల్ వేటలో దూసుకెళ్తోంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జంట కాంగ్ ఖాయ్ గ్జింగ్ -- అరోన్ తాయ్ (మలేషియా) జోడీని చిత్తు చేసింది. తొలిసెట్‌ను 19-21తో కోల్పోయిన సాత్విక్ -- చిరాగ్ రెండో సెట్‌లో పుంజుకొని ప్రత్యర్థికి షాకిచ్చారు. 21-17తో సెట్‌ను కైవసం చేసుకొని.. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ మలేషియా ద్వయానికి సాత్విక్ -- చిరాగ్ ఏమాత్రం అవకాశమివ్వలేదు. అంతకుముందు మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో పీవీ సింధుకు నంబర్ 1 అన్ సే యాంగ్(దక్షిణ కొరియా) చెక్ పెట్టింది. తొలి సెట్‌లో అటాకింగ్ గేమ్‌తో ఆకట్టుకున్న సింధుకు యాంగ్ షాకిచ్చింది. 17-21తో కోల్పోయిన తెలుగు తేజం రెండో సెట్‌లోనూ స్థాయికి తగ్గట్టు ఆడలేదు. ఫలితంగా యాంగ్ 21-14తో పైచేయి సాధించి సెమీస్ బెర్తు ఖరారు చేసుకుంది.

## మళ్లీ వైభవ్ సెంచరీ మిస్

ఐపీఎల్-2026 సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ వరుసగా రెండో మ్యాచ్‌లో సెంచరీ చేసే అవకాశాన్ని తృటిలో కోల్పోయాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో 97 పరుగులు చేసి సెంచరీకి అడుగు దూరంలో నిలిచిపోయిన వైభవ్.. ఇప్పుడు రాజస్తాన్ రాయల్స్‌పై అదే సీన్ రిపీట్ చేశాడు. గత మ్యాచ్‌తో పోలిస్తే కాస్త ఆచితూచి ఆడిన సూర్యవంశీ సులువుగా తన మూడో ఐపీఎల్ సెంచరీ మార్క్‌ను అందుకుంటాడని అంతా భావించారు. కానీ మరోసారి సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో వైభవ్ నిలిచిపోయాడు. రబాడ బౌలింగ్‌లో భారీషాట్‌కు ప్రయత్నించి థర్డ్‌మ్యాన్‌లో వైభవ్ దొరికపోయాడు. ఎస్ఆర్‌హెచ్‌తో మ్యాచ్‌లోనూ ఈ విధంగానే అతడు తన వికెట్‌ను కోల్పోయాడు. ఇక ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో 47 బంతులు ఎదుర్కొన్న సూర్యవంశీ.. 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 96 పరుగులు చేశాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు 90ల్లో అవుట్ అయిన బ్యాటర్ల సరసన వైభవ్ చేరాడు. డేవిడ్ వార్నర్, కె.ఎల్ రాహుల్ లాంటి దిగ్గజాల రికార్డును అతను సమం చేశాడు.

**అత్యధిక సార్లు 90ల్లో అవుట్ అయిన బ్యాటర్లు వీరే**

**వైభవ్ సూర్యవంశీ-3, డేవిడ్ వార్నర్-3, కేఎల్ రాహుల్-3, గ్లెన్ మాక్స్‌వెల్-3, రుతురాజ్ గైక్వాడ్-3**



## వైభవ్ బ్యాటుకు డిమాండ్

ఈ ఐపీఎల్ సీజన్‌లో 15 మ్యాచ్‌లాడిన వైభవ్ సూర్యవంశీ 242 స్ట్రైక్‌రేట్‌తో 680 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో వైభవ్ ఉపయోగిస్తున్న బ్యాట్ స్పాన్సర్‌షిప్‌కు సంబంధించి కళ్లు చెదిరే ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ వాడుతున్న బ్యాట్‌కు ఎస్ఎస్ (సరీన్ స్పోర్ట్స్) కంపెనీ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. అయితే ఇకపై వైభవ్ తన బ్యాట్‌పై ఏడాదికి రూ. 12కోట్లు అందుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎస్ఎస్ కంపెనీతో ఉన్న ఒప్పందంతో పోలిస్తే ఇది 24 రేట్లకు ఎక్కువ అని చెప్పొచ్చు. అయితే ఈ కొత్త ఒప్పందం ప్రస్తుత స్పాన్సర్ ఎస్ఎస్‌తోనే జరిగిందా లేక వేరే కంపెనీ స్పాన్సర్‌గా వ్యవహరించనుందా అనేది తెలియాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీకి వైభవ్ పోటీగా మారనున్నాడు. ప్రస్తుతం కోహ్లీ బ్యాట్‌కు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఎంఆర్ఎఫ్ ఏడాదికి రూ. 12.5 కోట్లు అందుకుంటున్నాడు. అయితే ఎంఆర్ఎఫ్ కూడా వైభవ్ బ్యాట్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 30-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# ఉడుకుతున్న నగరాలు

భారతదేశ నగరాలు ఇప్పుడు ఒక ప్రమాదకరమైన దశలోకి ప్రవేశిస్తున్నాయి. ఎండాకాలం అంటే ఇక సాధారణ ఋతు మార్పు కాదు; ప్రాణాలకు ముప్పు తెచ్చే వేడి తరంగాలు, తాగునీటి కొరత, ఆరోగ్య సంక్షోభాల కాలంగా మారుతోంది. ప్రతి ఏడాది ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. చెరువులు ఎండిపోతున్నాయి, భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి, నీటి ట్యాంకర్ల కోసం ప్రజలు క్యూలలో నిలబడుతున్నారు. అయినప్పటికీ పట్టణ భారతం ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనే సిద్ధతలో తీవ్రంగా వెనుకబడి ఉంది. ఈ సమస్యకు కారణం కేవలం వాతావరణ మార్పులు మాత్రమే కాదు; అవ్యవస్థిత పట్టణ ప్రణాళిక కూడా ప్రధాన కారణం. ఒకప్పుడు నగరాలకు చల్లదనాన్ని ఇచ్చిన చెరువులు, వాగులు, పచ్చని ప్రదేశాలు ఇప్పుడు కాంక్రీట్ అడవులుగా మారిపోయాయి. ఫ్లైఓవర్లు, మాల్స్, భారీ భవనాల కోసం చెట్లు నరికి వేయడం సాధారణమైంది. ఫలితంగా నగరాలు వేడిని నిల్వ చేసుకునే "హీట్ ఐలాండ్స్"గా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అత్యంత దెబ్బతింటున్నవారు పేదలే. బస్తీల్లో నివసించే ప్రజలు గంటల తరబడి నీటి కోసం ఎండలో నిలబడాల్సి వస్తోంది. కూలీలు, డెలివరీ సిబ్బంది, వీధి వ్యాపారులు మండుతున్న ఎండలో కూడా పని చేయక తప్పదు. ధనికులు ఎయిర్ కండిషనర్లలో ఆశ్రయం పొందగలిగితే, పేదలు మాత్రం దాహం, అలసట, అనారోగ్యంతో పోరాడుతున్నారు. వేడి తరంగాలు భారత సమాజంలోని అసమానతలను మరింత స్పష్టంగా బయటపెడుతున్నాయి. నీటి సంక్షోభం పరిస్థితిని ఇంకా తీవ్రమవుతోంది. అనేక నగరాలు భూగర్భ జలాలపై అధికంగా ఆధారపడుతున్నాయి. కానీ ప్రకృతి తిరిగి నింపే వేగం కంటే ఎక్కువగా వాటిని వినియోగిస్తున్నారు. వర్షాభావం, బలహీనమైన మాన్సూన్ కారణంగా చెరువులు త్వరగా ఎండిపోతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రణాళికల కంటే తాత్కాలిక ట్యాంకర్ రాజకీయాలపైనే ఆధారపడుతున్నాయి. భారత పట్టణాభివృద్ధి విధానం వాతావరణ మార్పులను ఇప్పటికీ అత్యవసర అంశంగా పరిగణించడం లేదు. భవన నిర్మాణాల్లో వేడిని తగ్గించే సాంకేతికతలు అరుదు. వర్షపు నీటి సంరక్షణ చట్టాలు ఉన్నా అమలు బలహీనంగా ఉంది. పలు నగరాల్లో హీట్ యాక్షన్ ప్లాన్లు కూడా లేవు. వాతావరణ మార్పు ఈ సంక్షోభాన్ని మరింత ప్రమాదకరంగా మార్చుతోంది. వేడి తరంగాలు మరింత పొడవుగా, తీవ్రంగా మారుతున్నాయి. భవిష్యత్తులో భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మనిషి జీవనానికి అనుకూలం కాని ఉష్ణోగ్రతలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొనాలి. చెరువుల పరిరక్షణ, పచ్చదనం పెంపు, వర్షపు నీటి నిల్వ, మురుగు నీటి పునర్వినియోగం వంటి చర్యలు తప్పనిసరి కావాలి. వేడి తరంగాల సమయంలో ప్రజలకు రక్షణ కేంద్రాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, కార్మికులకు భద్రతా నిబంధనలు అమలు చేయాలి. అభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు కాదు; ప్రజలు సురక్షితంగా జీవించగల నగరాలను నిర్మించడం. వాతావరణ మార్పుల యుగంలో జీవించలేని నగరాలు ఎంత ఆధునికంగా కనిపించినా అవి విఫలమైన నగరాలే. భారతదేశం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే, రాబోయే కాలంలో నగర జీవితం మరింత కఠినమవడం ఖాయం.

# కాలం మెచ్చిన ప్రజా నాయకుడు




కాటారం మండలం ధన్వాడ గ్రామ మట్టిలో పుట్టి.. ప్రజల కష్టాలను చిన్ననాటి నుంచే కళ్లారా చూసి పెరిగిన నాయకుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు. గ్రామీణ జీవితం ఇచ్చిన విలువలు.. తండ్రి దుద్దిళ్ల శ్రీపాదరావు చూపిన ప్రజాసేవ మార్గం.. ప్రజల పట్ల ఉన్న అపారమైన ప్రేమ ఆయనను నేడు తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక శక్తిగా నిలబెట్టాయి. పేదల కన్నీటి విలువ తెలిసిన మనిషిగా.. ప్రజల బాధను తన బాధగా భావించే నాయకుడిగా.. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారు.

తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ "తండ్రికి తగ్గ తనయుడు" అనే గౌరవాన్ని సంపాదించుకున్న శ్రీధర్ బాబు.. సౌమ్యత, సేవా తత్వం, అభివృద్ధి దూరదృష్టితో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తున్నారు. గ్రామం నుంచి గ్లోబల్ వేదికల వరకు తెలంగాణ పేరు ప్రతిష్ఠలను చాటుతూ.. ప్రజల ఆశయాలనే తన రాజకీయ జీవిత లక్ష్యంగా మార్చుకున్న అరుదైన ప్రజానాయకుడిగా ఎదుగుతున్నారు. 58వ వసంతంలోకి అడుగుపెడుతున్న తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాజకీయాల్లో విలువలకు, ప్రజాసేవకు, అభివృద్ధి దూరదృష్టికి ప్రతీకగా నిలిచారు. 1969 మే 30న జన్మించిన శ్రీధర్ బాబు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు తనయుడు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని మాత్రమే కాదు.. ప్రజల పట్ల ప్రేమ, సేవా తత్వం, నిబద్ధతను కూడా వారసత్వంగా అందిపుచ్చుకుని ప్రజానాయకుడిగా ఎదిగారు.

సౌమ్యత్వం ఆయన వ్యక్తిత్వం.. సేవ ఆయన జీవన విధానం.. అభివృద్ధి ఆయన ధ్యేయం.. ప్రజల సంక్షేమం ఆయన శ్వాస. పేదల సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమయ్యే నాయకుడు.. కష్టాల్లో ఉన్నవారికి కొండంత భరోసా ఇచ్చే మనిషి.. మాటల కంటే చేతల్లో చేసి చూపించే ప్రజానాయకుడు.. అదే శ్రీధర్ బాబు. తెలంగాణ రాజకీయ చరిత్రలో నిష్పక్షపాత స్పీకర్‌గా, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు. ఆయన ఆశయాలను, సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్న వారసుడిగా శ్రీధర్ బాబు ప్రజా జీవితంలో అడుగుపెట్టారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన ఆయన.. అనంతరం హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే చురుకుదనం, నాయకత్వ లక్షణాలు, విశ్లేషణాత్మక దృక్పథంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. 1998లో హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన శ్రీధర్ బాబు.. తండ్రి అకాల మరణంతో జీవితాన్నే ప్రజాసేవకు అంకితం చేశారు. 1999 ఏప్రిల్‌లో నక్సలైట్ల కాల్పుల్లో శ్రీపాదరావు హత్యకు గురికావడం మంథని నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. అదే సమయంలో ప్రజల కోసం నిలబడాలని సంకల్పించిన శ్రీధర్ బాబు రాజకీయ రంగప్రవేశం చేశారు.

1999 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 29 ఏళ్ల వయసులోనే మంథని నుంచి పోటీ చేసిన శ్రీధర్ బాబు ఘన విజయం సాధించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం నేటికీ విజయవంతంగా కొనసాగుతోంది. 1999, 2004, 2009, 2018, 2023 ఎన్నికల్లో వరుస విజయాలు సాధిస్తూ ఐదు సార్లు ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. ఒక నియోజకవర్గం ప్రజలు వరుసగా ఐదు సార్లు ఆశీర్వదించడం సాధారణ విషయం కాదు. అది ప్రజల్లో ఆయనపై ఉన్న అపారమైన విశ్వాసానికి నిదర్శనం. మంథని నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు రికార్డును మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అధిగమించారు. మంథని నుంచి 1957, 1962, 1967, 1972 ఎన్నికల్లో వరుసగా నాలుగు సార్లు పీవీ నర్సింహారావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే దుద్దిళ్ల శ్రీధరా బాబు ఇదే మంథని నియోజకవర్గం నుంచి 1999, 2004, 2009, 2018, 2023 ఎన్నికల్లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది పీవీ రికార్డును బద్దలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శ్రీధర్ బాబు ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. మంథని ప్రజలకు ఆయన కేవలం ఎమ్మెల్యే కాదు.. కుటుంబ సభ్యుడు.. సమస్యల సమయంలో ముందుండే ఆత్మబంధువు.

## వైయస్సార్ గురువు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రీధర్ బాబు కీలకంగా పనిచేశారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేశారు. వైయస్సార్ చేపట్టిన పాదయాత్ర, ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారు. వైయస్సార్ రాజకీయ దూరదృష్టి, ప్రజలతో మమేకమయ్యే తత్వం శ్రీధర్ బాబుపై గాఢమైన ప్రభావం చూపింది. వైయస్సార్ రాజకీయ గురువు" అని శ్రీధర్ బాబు తరచూ చెబుతుంటారు. శ్రీధర్ బాబు రాజకీయ ప్రస్థానంలో ప్రతి బాధ్యత ఆయన సామర్థ్యానికి నిదర్శనం. కరీంనగర్ డిసిసి అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది వేశారు. అనంతరం ప్రభుత్వ విప్‌గా శాసనసభ నిర్వహణలో తన ప్రతిభ చాటుకున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కే. రోశయ్య, ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో ఉన్నత విద్య, ఎన్నారై వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖలను సమర్థంగా నిర్వహించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో కీలక మంత్రిగా వ్యవహరిస్తున్నారు. నిర్ణయాల్లో స్పష్టత.. పరిపాలనలో పారదర్శకత.. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం ఆయన ప్రత్యేకతగా నిలిచాయి. శాసనసభ వ్యవహారాల మంత్రిగా పనిచేసిన సమయంలో 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ చరిత్రలో ఆయన పేరు ప్రత్యేకంగా నిలిచిపోయింది. తెలంగాణ ఆకాంక్షలను గౌరవిస్తూ.. రాజకీయ ఒత్తిడుల మధ్య కూడా తన ధైర్యసాహసాలను చాటుకున్నారు.

2023 తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి వెనుక ఉన్న కీలక వ్యూహకర్తల్లో శ్రీధర్ బాబు ఒకరు. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి రైతులు, మహిళలు, యువత, మేధావుల అభిప్రాయాలను సేకరించారు. ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి కీలక హామీల రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా రూపొందిన ఆ మేనిఫెస్టో కాంగ్రెస్ విజయానికి బలమైన ఆయుధమైంది. రేవంత్ రెడ్డి టీంలో కీలక సారథి.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా శ్రీధర్ బాబు అత్యంత చురుకైన పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడంలో ఆయన కీలక సారథిగా నిలిచారు. దావోస్, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో నిర్వహించిన పెట్టుబడి సదస్సుల్లో తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచారు. లక్షలాది కోట్ల రూపాయలను తెలంగాణ రాష్ట్రంలో వివిధ కంపెనీలు పెట్టుబడులు పెట్టించడంలో కీలకంగా వ్యవహరించారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి 2024, 2025, 2026 దావోస్ తో పాటు వివిధ దేశాల్లో పర్యటించడం ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం.. వేలాది ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమం చేయడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఏఐ, సెమీకండక్టర్, డేటా సెంటర్, ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

యువతే తెలంగాణ భవిష్యత్తు అనే నమ్మకంతో శ్రీధర్ బాబు నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మిస్తున్న "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" ద్వారా ప్రపంచ స్థాయి శిక్షణ అందించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఫార్మా, ఏవియేషన్, లాజిస్టిక్స్, రిటైల్, ఐటీ రంగాల్లో ప్రత్యేక శిక్షణతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు ద్వారా తెలంగాణను "స్కిల్ హబ్"గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. శ్రీధర్ బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా మారింది. జేఎన్‌టీయూ కళాశాల, డిగ్రీ కళాశాలల ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఆరోగ్య సేవల అభివృద్ధికి వందలాది కోట్ల రూపాయల నిధులు సమకూర్చారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టితో సాగునీటి వసతులు, రైతు సంక్షేమం, భూమిలేని పేదలకు భూమి పంపిణీ వంటి అంశాల్లో చురుకుగా వ్యవహరించారు. "ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలి" అన్న లక్ష్యంతో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు.

## 2025 సరస్వతి పుష్కరాలు

ప్రస్తుతం సాగుతున్న అంత్యపుష్కరాలు అంగరంగ వైభవంగా నిర్వహించడంలో శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సమకూర్చారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, రహదారుల విస్తరణ, యాత్రికులకు సౌకర్యాల కల్పనలో ఆయన కృషి ప్రశంసనీయంగా నిలిచింది. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునరుద్ధరణకు దాదాపు రూ.200 కోట్ల నిధులు శ్రీధర్ బాబు మంజూరు మంజూరు చేయించారు. శాశ్వత అభివృద్ధి పనులకు ఏప్రిల్ 20వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. కాళేశ్వరంలో దాదాపు నాలుగు కోట్లతో మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం, రహదారుల విస్తరణ, యాత్రికులకు వసతి సదుపాయాల కల్పనలో ఆయన కృషి ప్రశంసనీయంగా నిలిచింది. జూలై 2022 నుంచి ఆగస్టు 2024 వరకు కళ్యాణ కర్ణాటక ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఏఐసీసీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీధర్ బాబు, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి వ్యూహాత్మకంగా పనిచేశారు. పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషించారు. కర్ణాటకలో అద్భుతమైన మేనిఫెస్టోను రూపొందించారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ విజయానికి మేనిఫెస్టో ఎంతో దోహద పడింది. దట్ ఇస్ శ్రీధర్ బాబు.. తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి శైలజ రామయ్యర్ ను వివాహం చేసుకున్న శ్రీధర్ బాబుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఖాళీ సమయాల్లో కుటుంబంతో గడపడం ఆయనకు ఇష్టం. విద్యార్థి దశలో మంచి క్రికెటర్‌గా నిజాం కాలేజ్ మరియు హైదరాబాద్ విశ్వవిద్యాలయ జట్లకు ప్రాతినిధ్యం వహించారు.

రాజకీయాల్లో పదవులు చాలామందికి వస్తాయి. కానీ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించేది కొద్దిమంది మాత్రమే. అలాంటి అరుదైన నాయకుడు శ్రీధర్ బాబు. సామాన్య కార్యకర్త నుంచి మేధావుల వరకు అందరితో సమానంగా మెలిగే నాయకత్వం ఆయనది. ప్రజల మధ్యే ఉండి సమస్యలకు పరిష్కారం చూపే నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. పేదల పక్షాన నిలుస్తూ.. యువత భవిష్యత్తు కోసం కృషి చేస్తూ.. తెలంగాణ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఆయన నిజమైన ప్రజానాయకుడిగా నిలిచారు. లాయర్‌గా ప్రారంభమైన ప్రయాణం.. నేడు తెలంగాణ రాజకీయాల్లో సమర్థ మంత్రిగా ఎదగడం వెనుక కృషి, నిబద్ధత, ప్రజలపై ప్రేమ దాగి ఉంది. అందుకే దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేరు నేడు తెలంగాణ రాజకీయాల్లో ఒక నమ్మకం.. ఒక బ్రాండ్.. ఒక ప్రజా శక్తిగా మారింది. 58వ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న మంత్రి శ్రీధర్ బాబు ఆయన ఆయురారోగ్యాలతో, మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో ముందుకు సాగాలని.. తెలంగాణ అభివృద్ధిలో మరింత ఉన్నతంగా సేవ చేయాలని కోరుకుందాం.. శ్రీధర్ బాబు ఒక లెజెండ్ విజినరీ లీడర్ డైనమిక్ నేత..తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని నిరంతరం శ్రమిస్తున్నారు. శ్రీధర్ బాబు కల త్వరలోనే నెరవేరాలని ఆశిద్దాం.



గొట్టిముక్కుల బ్రహ్మచారి
సీనియర్ జర్నలిస్ట్
9441884389

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.